
సాక్షి
హనుమకొండ
శనివారం । 26 । జూలై । 2025



విజయమే లక్ష్యంగా ఆడాలి
విజయమే లక్ష్యంగా ఆటలు ఆడాలని సీపీ సన్‌ప్రీత్ సింగ్ క్రీడాకారులను కోరారు.
- 8లో▸



అధ్వానం.. ఎంజీఎం అత్యవసర విభాగం - 8లో▸
వైద్య అధికారుల నిర్లక్ష్యంతో వరంగల్ ఎంజీఎం అత్యవసర విభాగం నిత్యం వివాదాస్పదంగా మారుతోంది.

వాతావరణం
గరిష్టం/కనిష్టం $28^0/24^0$
జిల్లాలో ఉదయం ఆకాశం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉమ్మడి వరంగల్ స్పెషలాఫీసర్‌గా శశాంక



సాక్షిప్రతినిధి, వరంగల్ : ఉమ్మడి వరంగల్ స్పెషలాఫీసర్‌గా ఐఏఎస్ అధికారి కె.శశాంక నియమితులయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా పది ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించిన ప్రభుత్వం ఉమ్మడి వరంగల్‌కు 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శశాంక పేరును ప్రకటించింది. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఆయన గతంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. ఇటీవల ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి కమిషనర్‌గా నియమించిన ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ స్పెషలాఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

మహిళా హాస్టల్‌లో షార్ట్ సర్క్యూట్..

- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- వర్షంలో విద్యార్థినుల ఆందోళన



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పద్మాక్షి మహిళా హాస్టల్ ఏబ్లాక్‌లో శుక్రవారం రాత్రి 9గంటలకు షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పీజీకోర్సుల విద్యార్థినులు ఇబ్బందులు పడ్డారు. మొదటిగేట్ వద్దకు వెళ్లి వర్షంలోనే ఆందోళనకు దిగారు. హాస్టల్ సమీపంలోనే ఉండే ఈ బ్లాక్‌కి తమను షిఫ్ట్ చేయించాలని డిమాండ్ చేశారు. కేయూసీ సీఐ రవికుమార్, ఎస్‌ఐలు రవీందర్, శ్రీకాంత్‌లు ఘటనస్థలినిక చేరుకుని విద్యార్థినులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఎలక్ట్రీషియన్‌లు మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రిజిస్ట్రార్ రామచంద్రం, హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్‌లు విద్యార్థినుల వద్దకు వచ్చి మాట్లాడారు. శిథిలమైన ఏ బ్లాక్‌లోకి వెళ్లబోమని ఈ– బ్లాక్ హాస్టల్‌లోకి ఇప్పుడే షిఫ్ట్‌చేయాలని డిమాండ్ చేయగా రిజిస్ట్రార్ రామచంద్రం షిఫ్టింగ్‌కు ఒకే చెప్పారు. దీంతో రాత్రి ఒక్కొక్కరుగా ఈ–బ్లాక్‌లోకి షిఫ్ట్ అయ్యారు.

కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ బీఓఎస్‌గా శ్రీనివాస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా (బీఓఎస్) ఆవిభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చీకటి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీసీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వుల కాపీని శ్రీనివాస్‌కు అందజేశారు. ఇప్పటి వరకు బీఓఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ అకుతోట శ్రీనివాస్ నుంచి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరిస్తారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న కోరారు. శుక్రవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఆర్‌ఎం డి.విజయభానును ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కలిశారు. ఈసందర్భంగా పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లను పరిశీలించి పరిష్కరించాలని కోరారు. మంగపేట, ములుగులో సిబ్బందికి రెస్ట్ రూం సౌకర్యం కల్పించాలని ఆర్‌ఎంకు విన్నవించారు. ఆర్‌ఎం డి.విజయభాను సానుకూలంగా స్పందించినట్లు ఈదురు వెంకన్న తెలిపారు. నైట్ హాల్ట్ సిబ్బందికి రెస్ట్ రూం సౌకర్యం కల్పిస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ వరంగల్ రీజియన్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, బి.జనార్దన్, టి.శ్రీనివాస్, పోతరాజు రమేశ్, బి.రాకేశ్, రాము పాల్గొన్నారు.

ఇక.. భూసేకరణ వేగవంతం

మామునూరు విమానాశ్రయంపై సర్కారు నజర్



పర్యాటకం, ఐటీ పరిశ్రమలకు బూస్ట్..

- మామునూరు ఎయిర్‌పోర్ట్ ప్రారంభమైతే కొచ్చిన్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ మాదిరిగానే భద్రాచలం, రామప్ప, లక్నవరం, మేడారానికి భక్తులు, సందర్శకులు పెరుగుతారు.
- టైర్–2 పట్టణాల్లోనూ ఐటీ విస్తరణలో భాగంగా ఎయిర్‌పోర్ట్ కీలకంగా మారనుంది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని కైటెక్స్ మాదిరిగానే మరిన్ని అంతర్జాతీయ వ్యాపారసంస్థలు ముందుకు వస్తాయి. దీంతో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కే అవకాశముంది.
- మామునూరు సమీప ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం పెరుగుతుంది.

- తాజాగా 253 ఎకరాల కోసం రూ.205 కోట్లకు పాలనాపరమైన అనుమతులు
- విమానాశ్రయానికి 50 శాతం మందికిపైగా రైతులు అంగీకారం
- మరో రూ.112 కోట్లు అత్యవసరం

సాక్షి, వరంగల్:

మామునూరు విమానాశ్రయం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇందులో భూములు కోల్పోతున్న నిర్వాసితులతో పరిహారం విషయమై ఇప్పటికే డిస్ట్రిక్ట్ లెవెల్ ల్యాండ్ నెగోషియేషన్ కమిటీ చర్చించింది. వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.1.20 కోట్లు, వ్యవసాయేతర భూములకు చదరపు గజానికి రూ.4,887గా నిర్ణయించింది. పాత ఎయిర్ స్ట్రిప్‌నకు చెందిన 696 ఎకరాల భూమి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆధీనంలో ఉంది. ఈ రన్‌వే విస్తరణ కోసం అదనంగా అవసరమయ్యే 253 ఎకరాల భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.205 కోట్లు కేటాయించింది. అందుకు పరిపాలన అనుమతులకు శుక్రవారం మంజూరు ఇవ్వడంతో ఇక భూసేకరణ వేగవంతం కానుంది. కాగా, 50 శాతం మందికిపైగా మంది రైతులు తమ కన్సెంట్ (అంగీకార పత్రం) తెలపడంతో ఎలాంటి అడ్డంకులు లేకుండానే భూసేకరణ జరుగుతుందని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు రూ.205 కోట్లు కేటాయించిన జీఓ ఆధారంగా ఇప్పుడు బడ్జెట్ కేటాయించారంటున్నారు.

మూడు జిల్లాలను అనుసంధానించేలా...

కేంద్రం ఉడాన్ పథకం కింద 2022 సెప్టెంబర్‌లో మామునూరు విమానాశ్రయాన్ని ఎంపిక చేసింది. నిజాం కాలంలోని ఈ విమానాశ్రయంలో ఎయిర్‌స్ట్రిప్ అందుబాటులో ఉండేది. అక్కడ 1400 మీటర్ల పొడవైన రన్ వే, గ్లైడర్స్ దిగేందుకు మరో చిన్న రన్‌వే ఉంది. ఈ రన్ వే విస్తరణకు అదనంగా 253 ఎకరాల భూసేకరణ అవసరం. ముఖ్యంగా వరంగల్ చేరుకోవాలంటే హైదరాబాద్ దిగి మూడు గంటలు ప్రయాణం చేయాల్సి ఉంది. ఇది పెట్టుబడులకు ఆటంకంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వరంగల్‌లోనే నేరుగా ల్యాండ్ అయ్యే అవకాశం ఉంటే వేగంగా పెట్టుబడులు వస్తాయని భావించింది. అలాగే, ఉత్తర తెలంగాణలో మరో ముఖ్య పట్టణమైన కరీంనగర్‌తోపాటు ఖమ్మం, నల్లగొండ జిల్లాల ప్రజలు మామునూరు విమానాశ్రయం నుంచే రాకపోకలు సాగించేలా రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం వరంగల్–కరీంనగర్ మధ్య 80 కిమీ మేర ఎన్‌హెచ్ విస్తరణ పనులు జరుగుతున్నాయి. వరంగల్ –ఖమ్మం నేషనల్ హైవే ప్రస్తుత రద్దీకి అనుగుణంగా లేదు. నల్లగొండ ప్రజలను ఓరుగల్లుతో అనుసంధానించేందుకు వరంగల్–దంతాలపల్లి–సూర్యాపేట వరకు రెండు వరుసల ఎన్‌హెచ్ ఉంది. దీన్ని నాలుగు వరుసలుగా విస్తరించాలి. వరంగల్ నుంచి 15 కిమీ దూరంలో ఉన్న మామునూరుకు వరంగల్, హనుమకొండ, కాజీపేట నుంచి రేడియల్ రోడ్లు నిర్మించాలి. నగర ఇన్నర్, ఔటర్ రింగురోడ్లను ఎయిర్‌పోర్టుతో అనుసంధానిస్తారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు



మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో వరంగల్‌కు మహర్దశ పట్టనుంది. భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లు నిధులు విడుదల చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.1.20 కోట్లు పరిహారం ఇవ్వనుంది. ఖాళీ ప్లాట్లు, ఇళ్లకు సైతం న్యాయమైన పరిహారం చెల్లిస్తుంది. నెల రోజులుగా భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎంతో కృషి చేశారు.

– మంత్రి కొండా సురేఖ

మరో రూ.112 కోట్లు అవసరమే..

విమానాశ్రయ నిర్మాణానికి నక్కలపల్లి, గాడిపల్లి, గుంటూరుపల్లిలో 240 ఎకరాల వ్యవసాయ భూమి, సుమారు 13 ఎకరాల (61,134.5 చదరపు గజాల) వ్యవసాయేతర భూమి సేకరించాల్సి ఉంది. వ్యవసాయ భూమికి రూ.288 కోట్లు, వ్యవసాయేతర భూమికి రూ.29,87,61,858 భూనిర్వాసితులకు చెల్లించాలి. మొత్తంగా రూ.317 కోట్లు అవసరం అవుతుండగా.. మరోదఫా ప్రభుత్వం రూ.112 కోట్లు అవసరం. భూసేకరణ పూర్తయి, ఎయిర్‌పోర్ట్ ప్రారంభమైతే 150 నుంచి 186 మంది ప్రయాణించే ఏ–320, బీ–737 విమానాలు రాకపోకలు సాగించనున్నాయి.

రూ.13.74 కోట్ల బిల్లు క్లైమ్

ఎయిర్‌పోర్ట్‌లో భూములు, ఇళ్లు కోల్పోతున్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నక్కలపల్లికి చెందిన 15 మంది క్లియర్ టైటిల్ ఉన్న భూ బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు తొలుత రూ.13.74 కోట్ల బిల్లు క్లైమ్ చేసినట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు.

12 మందికి త్వరలోనే పరిహారం

ఖిలా వరంగల్: ఎయిర్‌పోర్ట్ విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న 12 మందికి పరిహారం అందిస్తామని అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. ఈమేరకు ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఖిలా వరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావుతో కలిసి గాడిపల్లిని సందర్శించి, రన్‌వే కింద కోల్పోతున్న ఇళ్లను పరిశీలించారు. బాధితులతో సమావేశమై నిబంధనల ప్రకారం ఇళ్లు ఖాళీ చేసేందుకు, స్థలానికి పరిహారం అందిస్తామని తెలిపారు.

పశువుల మాంసం, కొవ్వుతో నూనె



మాదారం కాలనీలోని ఓ ఇంట్లో పశువుల కళేబారాల కొవ్వు పదార్థాల నుంచి నూనె తయారు చేస్తున్న దృశ్యం, పశువుల కొవ్వు కరిగిస్తూ.., ఆటో ట్రాలీలో తరలిస్తున్న కల్తీ నూనె డబ్బాలు

- అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పరకాల కేంద్రంగా జోరుగా సాగుతున్న వ్యాపారం

పరకాల: అక్రమ సంపాదన కోసం కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఇప్పటికే మార్కెట్లో నకిలీ వంట నూనెలు కలవరపెడుతుండగా.. పరకాల పట్టణంలో కొంతకాలంగా పశువుల మాంసం, ఎముకలు, కొవ్వుతో నూనె తయారు చేస్తుండడం ఆందోళనకు గురిచేస్తోంది. పరకాలలో పశువులను వధించడం రోజురోజుకూ పెరిగిపోతోంది. గతంలో నిర్మానుష్య ప్రాంతంలో పశువులను వధించేవారు. ఇప్పుడు బహిర్గతంగా జనావాసాల నడుమ జరుగుతున్నా.. పట్టించుకునేవారు కరువయ్యారు. అధికారులు సైతం ప్రేక్షక పాత్ర పోషిస్తుండడంతో వ్యాపారులు మరింత రెచ్చిపోతున్నారు. రాజీపేట, సీఎస్‌ఐ కాలనీల్లో నాలుగు ఇళ్లకు ఒక పశుమాంస దుకాణాలు నిర్వహిస్తున్నారు. కల్తీ నూనె మాఫియా.. పరకాలలోని పశుమాంసం విక్రయదారులతో చేతులు కలిపి జోరుగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నారు. అయితే కొందరు తయారీదారులు మరో అడుగు ముందుకు వేసి రుచి బాగుంటుందని స్థానికంగా ఉన్న కొన్ని హోటళ్లు, తినుబండారాలు తయారు చేసే యజమానులతో చేతులు కలిపి వంట నూనె విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. చాలాకాలంగా పరకాలలో పశువుల మాంసం, కొవ్వు పదార్థాలతో నూనె తయారీ జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతోనే ప్రజలు రోగాల పాలవుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలాంటి మోసాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుల దాడులు..

పశువుల కళేబారాల నుంచి వచ్చే కొవ్వు పదార్థాలతో నూనె తయారుచేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో పరకాల పోలీసులు బీసీ కాలనీలోని పలు ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. పశువుల కొవ్వు పదార్థాలు, నూనె డబ్బాలు లభ్యమయ్యాయి. మస్తాన్, మహబూబ్, సలీం అనే ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కొవ్వు నుంచి తీసిన నూనెను ఎందుకోసం వాడుతున్నారు? ఎక్కడికి తరలిస్తున్నారనే విషయాలపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

డీఎంహెచ్‌ఓ అప్పయ్య



దామెరలో కళాజాత కార్యక్రమాన్ని తిలకిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

దామెర: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా.. కళాకారుల పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌ఓ హాజరై మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలు వృద్ధి చెందకుండా చూడాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాక్టర్ల సలహాలు పాటించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేంద్రకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ పిట్టల శ్రీకాంత్, రవీందర్‌కుమార్, వెంకటేశ్వర్లు, వనిత, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రుణ ప్రణాళిక రూ.15,455 కోట్లు

- హనుమకొండ జిల్లాకు ఖరారు చేసిన యంత్రాంగం
- ప్రాధాన్యత రంగానికి రూ.7,456 కోట్లు
- వ్యవసాయ రుణాలు మొత్తం రూ.4,056 కోట్లు
- పంట రుణాలు రూ.2,268 కోట్లు
- సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు రూ.3,320 కోట్లు
- గత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి రుణాలు



2024-25 ఆర్థిక సంవత్సరంలో రుణాలు ఇలా.. (రూ.కోట్లలో)

వార్షిక రుణప్రణాళిక	11,648
జారీ చేసినవి	13,639
రుణ వితరణ	117 శాతం

విభాగాల వారీగా ఇలా..

విభాగం	లక్ష్యం	రుణ వితరణ	శాతం
వ్యవసాయ	1,736	2,311	132
సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు	3,556	4029	113
ఇతర రంగాలు	3,280	2,044	62
మొత్తం ప్రాధాన్యత రంగం	7,413	6,214	84

- వ్యవసాయం, పరిశ్రమల్లో లక్ష్యానికి మించి రుణాలు ఇచ్చినా, ఇతర రంగాల రుణాల ఇవ్వడంలో 64 శాతానికి మించకపోవడంతో ప్రాధాన్యత రంగంలో 84 శాతంతో సరిపెట్టుకుంది.
- ప్రాధాన్యేతర రంగాలకు రూ.4235 కోట్ల లక్ష్యం నిర్దేశించుకోగా 7,425 కోట్ల రుణాలు ఇచ్చారు. ఇక్కడ 175 శాతం రుణాల జారీ జరిగింది.
- గతేడాది వార్షిక రుణ ప్రణాళికతో మొత్తం రుణాలు జారీని చూస్తే 117 శాతంతో అదనంగా రుణాలు ఇచ్చారు.

హన్మకొండ: హనుమకొండ జిల్లా రుణ ప్రణాళికలో వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రాధాన్యం ఇచ్చారు. రూ.15,455 కోట్లతో రూపొందించిన జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి రూ.4,056 కోట్లు కేటాయించగా.. ఇందులో పంట రుణాలు రూ.2,268 కోట్లుగా నిర్ధారించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి హనుమకొండ జిల్లా వార్షిక రుణ ప్రణాళికను జిల్లా అధికార యంత్రాంగం ఖరారు చేసింది. ఇందులో ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలుగా ప్రణాళికను తయారు చేశారు. జిల్లాలో ప్రధాన వృత్తి అయిన వ్యవసాయ రంగానికి అధిక మొత్తంలో రుణాలు ఇచ్చేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రాధాన్యతా రంగాలకు రూ.7,999 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు 7,456 కోట్లు రుణ వితరణ చేయాలని లక్ష్యాలుగా నిర్ధారించారు. గత ఆర్థిక సంవత్సరం మొత్తం రుణ ప్రణాళిక రూ.11,648 కోట్లు కాగా లక్ష్యానికి మించి రూ.13,639 కోట్ల రుణాలు జారీ చేశారు. దీంతో ఈసారి అదనంగా రూ.3,807 కోట్లు పెంచారు. జిల్లాలో మొత్తం 170 వివిధ బ్యాంకు బ్రాంచీలు ద్వారా రుణాలు అందించనున్నారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం..

వ్యవసాయ రంగంతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించేందుకు రూ.3,320 కోట్ల రుణాలు ఇచ్చేలా రుణ ప్రణాళికను సిద్ధం చేశారు. రైతులకు క్రాప్‌లోన్లతోపాటు, మార్ట్‌గేజ్, వ్యవసాయ యాంత్రీకరణ, పాడి పరిశ్రమ, సాగు నీటి కల్పన ఇతర వ్యవసాయ అవసరాలకు రుణాలలివ్వాలనున్నారు. కుటీర పరిశ్రమలు, స్టార్టప్‌లు వంటి పరిశ్రమల స్థాపనకు పెద్ద ఎత్తున రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్య, గృహ, స్వయం సహాయక సంఘాలకు సైతం రుణాలు అందించనున్నారు.

పాఠశాలలకు పూర్వ వైభవం తేవాలి

- కాంప్లెక్స్ సమావేశాల్లో డీఈఓ వాసంతి



శాయంపేట: మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

శాయంపేట: ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలని డీఈఓ వాసంతి అన్నారు. మండలంలోని పత్తిపాక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ప్రాథమిక పాఠశాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష గుణాత్మక విద్య కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.మన్మోహన్, ఎంఈఓ భిక్షపతి, పత్తిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఆర్పీలు అంజని, నారాయణ, అశోక్, మనోజ్, సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్యాల్ని మెరుగుపర్చుకోవాలి..

నడికూడ: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని డీఈఓ వాసంతి అన్నారు. మండలంలోని రాయపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ వాసంతి పాఠశాలల్లోని గ్రంథాలయాలు, ఎఫ్‌ఎల్‌ఎన్, లెర్నింగ్ ఔట్‌కమ్స్, బోధనాభ్యసన సామర్థ్యాలు, పాఠశాలలో నిర్వహించాల్సిన రికార్డుల గురించి ఉపాధ్యాయులకు వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ హనుమంతరావు, ఏఎంఓ బండారి మన్మోహన్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు



కౌశిక్‌రెడ్డిపై కమలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులపై అసత్య, వివాదాస్పద ఆరోపణలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం రాత్రి హనుమకొండ జిల్లా కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వీరభద్రరావుకు ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు మధ్య విబేధాలు సృష్టించేలా ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు, ప్రభుత్వం పడిపోయేలా చేస్తూ మంత్రులు, అందులో ముఖ్యంగా దళిత మంత్రులపై తప్పుడు, అసత్య ఆరోపణలు చేసి వారి మనోభావాలు దెబ్బతీశాడని కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఎం.. హీరోయిన్ల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నాడని, వారిని అర్ధరాత్రి 2 గంటలకు పర్సనల్‌గా పిలుస్తున్నాడని ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పీడీ యాక్ట్ నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఎంపీపీ మాట్ల రమేశ్, నాయకులు పోడేటి భిక్షపతి, తడక శ్రీకాంత్, బొల్లం రాజిరెడ్డి, కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా కృషి చేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య, అనుబంధ శాఖలతో సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానలు, 108, టీహబ్ పనితీరుపై కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ అప్పయ్య, అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్‌రావు, ఇమ్యునైజేషన్ అధికారి మహేందర్, టీబీ అధికారి హిమబిందు, ప్రోగాం అధికారులు డాక్టర్ ఇక్తేదార్, డాక్టర్ మంజుల, డెమో అశోక్‌రెడ్డి, 108 కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.



వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులు

అర్హులను త్వరగా ఎంపిక చేయాలి..

ఇందిర సౌర గిరి జలవికాసం పథకానికి అర్హుల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇందిర సౌర గిరి జల వికాసం పథకంపై ఐటీడీఏ, వ్యవసాయ, ఉద్యాన, గిరిజన సంక్షేమ, డీఆర్డీఏ, అటవీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మండల స్థాయి కమిటీలో అర్హులను ఎంపిక చేసి, కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా కమిటీకి ఎంపిక కోసం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

హనుమకొండ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా యంత్రాంగాన్ని వాతావరణ శాఖ అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజలకు 24 గంటల పాటు సేవలందించేందుకు కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని, సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. అత్యవసర సేవల కోసం కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1115కు ఫోన్ చేయాలని సూచించారు.

వరలక్ష్మీ.. నమోస్తుతే..!



వరంగల్ ఎంజీఎం ఎదుట రాజరాజేశ్వరీ దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు

శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా వరంగల్ ఎంజీఎం ఎదురుగా గల రాజరాజేశ్వరీ దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అర్చకులు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం దేవాలయంలోని హాలులో వరలక్ష్మీ అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించి సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

- హన్మకొండ కల్చరల్

క్లుప్తంగా

దాశరథిని స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న అంపశయ్య నవీన్

విద్యారణ్యపురి: తెలంగాణలో నిజాం పాలనాకాలంలో దాశరథి కృష్ణమాచార్య పోరాటపటిమ ఎంతో గొప్పదని, సమాజ చైతన్యానికి ఎంతో కృషిచేశారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో దాశరథి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా తెలంగాణ కోటి రతనాల వీణ అని నినదించిన దాశరథి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధిపతి డాక్టర్ లెంక సత్యనారాయణ, అధ్యాపకులు సమత, సాయిలు, సీతారాములు, రమేశ్, మహేందర్, శ్రీనివాస్, కృష్ణయ్య, గాయత్రీదేవి, నాగమణి, ఎడమ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహించి విజేతలకు అంపశయ్య నవీన్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు షురూ



పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో శుక్రవారం పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పలు విభాగాలను కేయూ వీసీ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. వీసీ వెంట పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, ప్రిన్సిపాల్ టి.మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమత, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్‌ఎల్ సౌజన్య ఉన్నారు.

వరలక్ష్మీ.. నమోస్తుతే..!



సంతోషిమాత దేవాలయంలో పూజ చేస్తున్న అర్చకుడు

శ్రావణమాసం ప్రారంభం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు
- మాసం మొత్తం ప్రతీ రోజు పండుగే ..

హన్మకొండ కల్చరల్ : శ్రావణం.. శుభప్రదం. ఈ మాసంలో ప్రతీ రోజు పండుగే. ప్రతీ గడియ శుభకరమే. ప్రతీ తిథి శ్రేష్టమే. అందుకే ఈ మాసంలో చేపట్టిన ప్రతీ కార్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ క్రమంలో మహాశివుడికి ప్రీతికరణమైన శ్రావణ మాసం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయాల్లో ఉదయం నుంచే అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా పలు చోట్ల ఆలయాలను సుందరంగా అలంకరించారు. కాగా, శ్రీవిశ్వావసు నామ సంవత్సరం శ్రావణ శుద్ధ పాడ్యమి (శుక్రవారం) నుంచి శ్రావణ బహుళ అమావాస్య (ఆగస్టు 23వ తేదీ, శనివారం) వరకు శ్రావణమాసోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శ్రావణమాసం విశిష్టతపై 'సాక్షి' ప్రత్యేక కథనం

పూజల పండుగ..

శుద్ధ పంచమిరోజు నాగపూజలు, గరుఢ పూజ, శుద్ధ పౌర్ణమి రోజు జంధ్యాలపున్నమిగా, రాఖీపౌర్ణమిగా, హైగ్రీవజయంతి, శ్రావణ బహుళ అష్టమిని శ్రీకృష్ణుని జన్మాష్టమిగా ఘనంగా జరుపుకుంటారు. బహుళ అమావాస్యను పొలాల అమావాస్యగానూ, అంధకారుడనే రాక్షసుడిని సంహరించిన రోజుగాను గోవులను, వృషభలను, పశువులను పూజించే రోజుగాను జరుపుకుంటారు.

ప్రతీరోజు ప్రత్యేకం..

శ్రావణమాసంలో సోమ, మంగళ, శుక్ర, శనివారాలను పవిత్రంగా భావించి ఈ రోజుల్లో నిష్టగా ఉంటారు. శ్రావణమాసంలోనే పోచమ్మ, మైసమ్మ తదితర స్త్రీ దేవతలకు,ఆది, బుధవారాల్లో బోనాలు జరుపుకుంటారు. శ్రావణసోమవారం శివుడికి ప్రీతికరమైనరోజు. అలాగే, శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయాలలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. మంగళవారం మంగళగౌరివ్రతాలు, గురువారం సాయిబాబా ఆలయాలలో అఖండసాయినామయజ్ఞాలు జరుగుతాయి. శ్రావణశుక్రవారం వరలక్ష్మి వ్రతం జరుపుకున్నవారికి పుణ్యంతో పాటు లక్ష్మీప్రసన్నం కూడా జరుగుతుందని, ధన,కనక, వస్తు, వాహనాలు చేకురుతాయని, పూర్వకాలంలో చారుమతిదేవి అనే మహిళ ఈ వ్రతాన్ని పాటించి సకల సంపదలు పొందిందని భక్తులు నమ్ముతారు.

వేయిస్తంభాల దేవాలయంలో ప్రతీ సోమవారం రుద్రాభిషేకాలు..

నగరంలోని చారిత్రక వేయిస్తంభాల దేవాలయంలో శ్రావణమాసోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీరుద్రేశ్వరశివలింగానికి మహాన్యాసపూర్వక ఏకాదశ జరుగుతుందని, అలాగే ప్రతీసోమవారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, రుద్రాహోమాలు, అన్నపూజలు జరుగుతాయని ఆలయప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. జూలై 29న పంచమితిథిరోజు నాగపూజలు, ఆగస్టు 9న పౌర్ణమిరోజు రక్షాబంధనం, 16న శ్రీకృష్ణాష్టమి నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

దేవాలయాల్లో ఏర్పాట్లు..

శ్రావణమాసోత్సవాల సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని దేవాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా నగరంలోని చారిత్రక శ్రీభద్రకాళి దేవాలయంలో శ్రీభద్రేశ్వరశివలింగానికి ప్రతీసోమవారం ప్రత్యేక పూజలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రతీ శుక్రవారం అమ్మవారికి కుంకుమ పూజలు, ఒడిబియ్యం సమర్పణలు, నాగపంచమిరోజు దేవాలయ ఆవరణలో పుట్టవద్ద పూజలు నిర్వహిస్తారు. అలాగే, పద్మాక్షి దేవాలయం, వరంగల్ ఎంజీఎం ఎదుట గల శ్రీరాజరాజేశ్వరీదేవి దేవాలయం, హంటర్‌రోడ్‌లోని సంతోషిమాత ఆలయం, లష్కర్‌బజార్‌లోని సంతోషిమాత ఆలయాల్లో వరలక్ష్మీవ్రతాలు, వీటితో పాటు నగరంలోని పలు వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ శ్రావణ మాస పూజలు, పండితప్రవచనాలకు ఏర్పాట్లు చేశారు.



భద్రకాళి దేవాలయంలో శ్రావణ రద్దీ..



భద్రకాళి అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : శ్రావణమాసం శుక్రవారం కావడంతో శ్రీభద్రకాళి దేవాలయాన్ని భక్తులు అధికసంఖ్యలో సందర్శించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఒడిబాల బియ్యం, చీరలు సమర్పించారు. ములుగు కలెక్టర్ దివాకర టి.ఎస్ కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే, తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులవల్లి వెంకటేశ్వర్లు, అకాడమీ మేనేజర్ శైలేశ్వర్‌రెడ్డి, అకాడమీ ఓఎస్‌డీ ఎంకే. రెహమాన్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు మహాదాశీర్వచనం అంజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పిన్న శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆలయ ఈఓ శేషుభారతి, ధర్మకర్త మండలి చైర్మన్ డాక్టర్ బండారు శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు వీరన్న, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, స్రవంతి, పూర్ణచందర్, ఆంజనేయులు, సతీశ్ పర్యవేక్షించారు.



భద్రకాళి దేవాలయంలో భక్తుల రద్దీ

ప్రకృతి పులకిస్తుంది..



శ్రావణ మాసంలో నిత్యం షోడశోపచార పూజలు, అగ్నిహోత్రంలో మూలికలు వేయడం ద్వారా వాతావరణంలో కాలుష్యం తగ్గుతుంది. ప్రకృతి పులకించి వర్షాలు పడతాయి. దేవాలయాలు సమాజ ఉన్నతికి, మానసిక పవిత్రతకు నిలయాలు.

-గంగు ఉపేంద్రశర్మ, ప్రధానార్చకుడు, వేయిస్తంభాల దేవాలయం, హనుమకొండ

తీర్థంలో రోగనిరోధక శక్తి..



మానసిక, శారీరక సమస్యలతో సతమతమయ్యే వారికి ఆలయం ఓ వైద్యాలయం. దేవాలయాల్లో ఇచ్చే తీర్థంలో రోగ నిరోధక శక్తి ఉంటుంది. కీళ్ల వ్యాధులు నయమవుతాయి. గుడి చుట్టూ ప్రదక్షణలు చేయడంతో రక్తపోటు, కీళ్ల వ్యాధులు నయమవుతాయి. అందుకే గుడికి వెళ్లడం అలవాటు చేసుకోవాలి.

-ఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి, ధర్మప్రవచకుడు, గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రం, హనుమకొండ

భగవంతుడిని పూజించడమే ఆధ్యాత్మికత..



ఉదయమే పూజలు చేయడం వల్ల మానసిక ప్రశాంతత పొందొచ్చు. భగవంతుడిని పూజించడం, దర్శించుకోవడం వల్ల ఆధ్యాత్మిక భావం పెంపొందుతుంది. భగవంతుడి దీక్ష తీసుకుని, స్మరణ చేస్తూ గడిపిన క్షణం ఒత్తిళ్లను, కష్టాలను అధిగమించే మానసిక స్థైర్యం పెరుగుతుంది.

-టీఆర్ బాలసుబ్రహ్మణ్యశర్మ, గురుస్వామి, శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయం, వరంగల్

నిజాయితీగా సేవలందించాలి: సీపీ



సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న పదోన్నతి పొందిన ఎస్సైలు

హసన్‌పర్తి: ప్రజలకు నిజాయితీగా సేవలందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన శివకుమార్, నర్సయ్య, చంద్రమౌళి, శర్మ, సాంబయ్య శుక్రవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. సీపీ చేతుల మీదుగా పదోన్నతి పొందిన ఎస్సైల భుజాలపై నక్షత్రాలు అలంకరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే వారికి భరోసా కల్పించాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై గౌరవ, మర్యాదలు పెంపొందించాలన్నారు.

కేఎంసీకి పలువురు ప్రొఫెసర్ల నియామకం

- వైద్యుల భర్తీతో మెరుగుపడనున్న సేవలు
- న్యూరాలజీ విభాగాధిపతిగా మాధవరావు
- సూపర్‌స్పెషాలిటీ విభాగంలో పలువురు వైద్యులకు పోస్టింగ్

ఎంజీఎం: నేషనల్ మెడికల్ కౌన్సిల్ షోకాజ్ నోటీసులతో ప్రభుత్వం కేఎంసీలో అసిస్టెంట్ పోస్టుల భర్తీతో పాటు, అసోసియేట్, ప్రొఫెసర్ స్థానాలకు పదోన్నతుల కౌన్సెలింగ్‌ను వేగవంతం చేసింది. ఈపదోన్నతుల ప్రక్రియలో భాగంగా అసోసియేట్ ప్రొఫెసర్లకు.. ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్రంలోని వివిధ కళాశాలలో ఖాళీగా ఉన్న స్థానాల్లో పోస్టింగ్‌లు కేటాయించారు. పదోన్నతులు పొందిన డాక్టర్ మాధవరావు మహబూబాబాద్ మెడికల్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా.. ప్రస్తుతం ప్రొఫెసర్‌గా పదోన్నతిపై కేఎంసీ న్యూరాలజీ విభాగాధిపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్డియాలజీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ మమతారెడ్డి ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. న్యూరో సర్జరీ విభాగంలో హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో అసోసియేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ లక్ష్మణ్‌రావు, ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది కేఎంసీకి కేటాయించబడ్డారు. యూరాలజీ విభాగానికి డాక్టర్ బి.సంతోశ్ పదోన్నతి ప్రొఫెసర్‌గా బదిలీ అయ్యారు. ఈక్రమంలో కేఎంసీ మెడికల్ కళాశాలకు ప్రొఫెసర్ల నియామకంతో ఎంజీఎంలో మెరుగైన సేవలందనున్నాయి.

నూతన రికవరీ పాలసీ

- ఏడాది పొడవునా రుణాల జారీ, రికవరీ
- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మాట్లాడుతున్న రవీందర్‌రావు

హన్మకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నూతన రికవరీ పాలసీ తీసుకొస్తున్నట్లు తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో పాలక మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్థిక లావాదేవీలు, రుణాల రికవరీ, మంజూరు, 2024-25 ఆడిట్ పురోగతి ని సమీక్షించారు. ఈసమావేశానికి అధ్యక్షత వహించిన మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ.. వరంగల్ డీసీసీబీని ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు అధికారులు, ఉద్యోగులు మరింత పట్టుదలతో పని చేయాలన్నారు. డీసీసీబీ ద్వారా ఏడాదంతా రుణాలు రికవరీ చేయడంతో పాటు కొత్త రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నాబార్డు డీడీఎం చంద్రశేఖర్, టెస్కాబ్ జీఎం లత, డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వజీర్ సుల్తాన్, జీఎం ఉషశ్రీ పద్మావతి, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి, రాజు, గంప స్రవంతి, కృష్ణ మోహన్, వైస్ చైర్మన్ కె. వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అధ్వానం.. ఎంజీఎం అత్యవసర విభాగం

- సీఎంఓ నిర్లక్ష్యం.. పోస్టుమార్టం కోసం రెండు రోజుల నిరీక్షణ
- మెడికల్ లీగల్ కేసు నమోదు చేయకుండానే క్షతగాత్రుడికి చికిత్స



ఎంజీఎం : వరంగల్ ఎంజీఎం అత్యవసర విభాగం నిత్యం వివాదాస్పదంగా మారుతోంది. ఆస్పత్రిలో ఉదయం ఓపీ విభాగం ద్వారా 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సేవలందిస్తారు. అనంతరం క్యాజువాలిటీ అత్యవసర విభాగం ద్వారానే ప్రతీ రోగికి సేవలందుతాయి. ఓపీ సమయంలో సైతం ప్రాణపాయస్థితిలో ఉన్న రోగులకు క్యాజువాలిటీ ద్వారానే చికిత్స అందిస్తారు. వైద్యసేవల్లో ఇంత కీలకమైన అత్యవసర విభాగం పూర్తి అధ్వానంగా మారుతోంది. 24 గంటల పాటు ఆర్‌ఎంఓ స్థాయి అధికారి పర్యవేక్షిస్తే తప్ప సమస్యలు పరిష్కారం కాని స్థాయికి అత్యవసర విభాగం చేరుకుంది.

పోస్టుమార్టం కోసం రెండు రోజుల నిరీక్షణ.

జూన్ 15వ తేదీన చుక్క రాజయ్య(54) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో రాజయ్య కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తిరిగి క్షతగాత్రుడిని జూలై 20 తేదీన ఎంజీఎం తరలించారు. 23వ తేదీన రాత్రి మృతి చెందాడు. దీంతో సిబ్బంది.. రాజయ్య మృతదేహాన్ని మార్చరీకి తరలించగా ఆస్పత్రి క్యాజువాలిటీలో సీఎంఓ (క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్)గా విధులు నిర్వర్తిస్తున్న ఓ వైద్యుడు.. రాజయ్య కేస్‌షీట్‌పై ఎంఎల్‌సీ(మెడికల్ లీగల్ కేసు) నమోదు చేయకపోవడంతో ఫోరెన్సిక్ వైద్యులు పోస్టుమార్టం చేసేందుకు నిరాకరించారు. ఈ విషయం బయటకు రావడంతో క్యాజువాలిటీ వైద్యులు గురువారం మృతదేహానికి పోస్టుమార్టం జరిగేలా ఎంఎల్‌సీ నమోదు చేసేందుకు అన్ని సిద్ధం చేశారు. కాగా, ఈ సమయంలో కేస్‌షీట్ కనిపించకపోవడంతో గందరగోళం నెలకొంది. మృతుడికి సంబంధించిన కేస్ షీట్ ఆ సమయంలో విధులు నిర్వర్తించిన నర్సింగ్ ఆఫీసర్ దగ్గర ఉండడంతో సదరు ఉద్యోగికి ఫోన్ ద్వారా సమాచారం అందించి కేస్ షీట్ గుర్తించారు. హుటాహుటిన శుక్రవారం ఉదయం వైద్యులంతా హాజరై కేస్ షీట్‌లో ఎంఎల్‌సీ వివరాలు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతదేహం రెండు రోజులు పోస్టుమార్టం కాకుండా వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయంపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంజీఎం పాలనాధికారులు పేర్కొన్నారు.

విజయమే లక్ష్యంగా ఆడాలి ..

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- అట్టహాసంగా రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ స్పోర్ట్స్: ప్రతీ క్రీడాకారుడు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా అమ్యేచూర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోనెక్స్ సన్‌రైజ్ 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ సుబేదారిలోని వరంగల్ క్లబ్‌లో జరిగిన ప్రారంభోత్సవ వేడుకలకు సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులు గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి వరంగల్ ఖ్యాతి చాటాలన్నారు. గౌరవ అతిథి తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదలతో పాటు మానసిక ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వరంగల్ ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. మహబూబాబాద్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మూల జితేందర్‌రెడ్డి, డాక్టర్ కొమ్ము రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరగనున్న పోటీలు వరంగల్ క్లబ్‌తో పాటు భీమారంలోని కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో కొనసాగుతాయని తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్, మేనేజర్లు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రమేశ్‌కుమార్, కార్యదర్శి పింగిళి రమేశ్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, వరంగల్ క్లబ్ జాయింట్ సెక్రటరీ బి. కన్నారెడ్డి, నిమ్మ మోహన్‌రావు, టోర్నమెంట్ పరిశీలకుడు యూపీఎస్ బాబు, స్పాన్సర్లు నేరెళ్ల విజయ్, వద్దిరాజు వెంకన్న, అమరలింగేశ్వర్‌రావు, సురభి కిరణ్, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, రావుల మురళి పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో ఉత్సాహం నింపిన సీపీ..

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ సీప సన్‌ప్రీత్‌సింగ్ తన అద్భుత ఆటతీరుతో క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కాగా, మొదటి రోజు వరంగల్ క్లబ్‌లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీలో 76 మ్యాచ్‌లు, కిట్స్ ఇండోర్ బాలుర సింగిల్స్, డబుల్స్ విభాగంలో 53 మ్యాచ్‌లు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రుద్రేశ్వరస్వామికి లక్షతులసీ అర్చన

- వేయిస్తంభాల ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు షురూ..



రుద్రేశ్వరస్వామికి లక్షతులసీ అర్చన

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో శ్రావణ శుద్ధ పాడ్యమి శుక్రవారం శ్రావణ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రావణంలోని మొదటి శుక్రవారం కావడంతో రుద్రేశ్వరస్వామికి లక్షతులసీ అర్చన నిర్వహించారు. వందలాది భక్తులు దేవాలయాన్ని సందర్శించారు. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. మార్వాడీ మహిళలు గంగా జలం కావళ్లను హనుమకొండ లష్కర్‌బజార్‌లోని రామ్‌మందిర్ నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి రుద్రేశ్వరుడికి అభిషేకం నిర్వహించారు. అనంతరం వ్యాపారవేత్త, దాత వద్దిరాజు వెంకటేశ్వర్లు, ఉమారాణి దంపతుల సౌజన్యంతో స్వామివారికి లక్షతులసీ అర్చన నిర్వహించారు. ఆలయ ఈఓ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు. శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకుని దేవాలయంలో క్యూలైన్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గట్టు మహేశ్‌బాబు, సిబ్బంది మధుకర్, రజిత పాల్గొన్నారు.

పెన్షనర్ల ప్రయోజనాలకు విఘాతం కల్పించొద్దు

హన్మకొండ: ఆర్థిక బిల్లులో పెన్షనర్ల ప్రయోజనాలకు విఘాతం కల్పించేలా చట్టం తీసుకురావొద్దని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం డిమాండ్ చేశారు. ఈచట్టం తీసుకురావడాన్ని నిరసిస్తూ శుక్రవారం హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు నారాయణగిరి వీరన్న, పెండ్యాల బ్రహ్మయ్య, రేబెల్లి వెంకటేశ్వర్‌స్వామి, ఆకునూరు విద్యాదేవి, కె.శంకర్‌రావు, ఆర్తి సంపత్‌కుమార్, పరికిపండ్ల వేణు, సదాశివరెడ్డి, వనజ, కె.చంద్రమౌళి, అట్ల వెంకటేశ్వర్లు, ఆకుతోట మహేందర్, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

'పింగిళి'లో మౌలిక వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో (అటానమస్) మరిన్ని మౌలిక వసతుల కల్పనకు, మహిళా యూనివర్సిటీగా గుర్తించేలా తనవంతు కృషి చేస్తానని ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని ఆకళాశాలలో ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'డిజిటల్ ఎకనామి ది ఇంపాక్ట్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆన్ గ్లోబల్ మార్కెట్స్' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయి ఆర్థిక సదస్సు ఫలితాలు.. రాష్ట్ర ఆర్థిక సమస్యలు తీర్చేలా ఉండాలని సూచించారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీహెచ్.కృష్ణారెడ్డి కీలకోపన్యాసం చేస్తూ.. ప్రపంచ ఆర్థిక రంగంలో వస్తు మార్పిడి కాలక్రమంలో ద్రవ్య మార్పిడిగా, డిజిటల్ ఎకానమీగా రూపాంతరం చెందిందన్నారు. సదస్సులో కన్వీనర్ డాక్టర్ పి.పద్మ రచించిన ప్రత్యేక గంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈసదస్సుకు 150 పరిశోధన పత్రాలు వచ్చినట్లు ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు, ఎకనామిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సురేశ్‌బాబు, అకడమిక్ కో-ఆర్డినేటర్ ఎం.అరుణ, అధ్యాపకులు డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ రామకృష్ణారెడ్డి, సుజాత, మధు, సారంగపాణి, యుగేందర్, బాలరాజు, లకన్‌సింగ్, సువర్ణ, రాజేశ్వరి పాల్గొన్నారు. ఈజాతీయ సదస్సు ఈనెల 26న ముగియనున్నది.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలి



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

హన్మకొండ అర్బన్: విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలంటే కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కంప్యూటర్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పట్టు సాధించాలని న్యూసైన్స్ డిగ్రీ, పీజీ కళాశాల డైరెక్టర్ కె.రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హంటర్ రోడ్డులోని న్యూసైన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో జెన్‌పాక్ట్ కంపెనీలో ఉద్యోగ నియామకాల కోసం శుక్రవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈడ్రైవ్‌కు ఉమ్మడి జిల్లా నుంచి వివిధ కళాశాలలకు చెందిన 242 మంది విద్యార్థులు హాజరుకాగా 56 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్స్ సీహెచ్ రాజేశం, సీహెచ్ కమలాకర్, వైస్ ప్రిన్సిపాళ్లు డి.శ్రావణ్‌కుమార్, మధుకర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అహ్మద్‌ఖాన్, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

కేయూను సందర్శించిన ఇన్ఫోసిస్ ప్రతినిధులు

కేయూ క్యాంపస్: ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్ ప్రతినిధులు శుక్రవారం కేయూను సందర్శించారు. ఆ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా కొన్నినెలల క్రితం యూనివర్సిటీకి 120 కంప్యూటర్లు అందజేసింది. వాటిని వివిధ విభాగాల్లో వినియోగించుకుంటున్నారు. వాటి పరిశీలన నిమిత్తం కంపెనీ ప్రతినిధులు వంశీ ముత్యపు, సుమంత్ వల్లాల, ఆదిత్య, శశికాంత్ కేయూను సందర్శించారు. వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇన్ఫోసిస్‌తో కేయూ ఎంఓయూ చేసుకోనుందని, అందుకు సుముఖంగా ఉన్నామన్నారు. నెట్‌వర్కింగ్ సెల్ డైరెక్టర్ రమేశ్, రమ ఉన్నారు.